# భిక్షాపాత్రం



బి. వెంకటేశ్వర్లు

వంటగదిలో హడావిడిపడుతూ భర్తకి, కొడుక్కీ క్యారేజీలు సిద్ధంచేస్తోంది సుజాత.

ఆఫీసుకు బయలుదేరిన సతీష్ వాచీ చూసుకుంటూ –

"సుజీ క్యారియర్లు సర్దడానికి ఇంతసేపా? నాకు టైం అవుతోంది. ఆలస్యమైతే మా బాసు అగ్గిమీద గుగ్గిలమవుతాడు. అతనంత చండశాసనుడు మరొకరు ఉండరు. పైగా వీడిని స్కూల్లో డ్రాప్‌చేసి మరీ వెళ్లాలి" అంటూ "ఏరా సుభాష్ నువ్వు రడీ అయ్యావా లేదా?" అని ఫోర్త్‌క్లాస్ చదువుతున్న సుభాష్‌ని అరిచినట్టుగానే అడిగాడు.

బూటు లేసులు వేసుకుంటున్న సుభాష్ "నేను రెడీ డాడీ..." అంటూ స్కూల్ బ్యాగ్ భుజాన తగిలించుకున్నాడు.

అంతలో క్యారియర్లు సర్దిన బుట్టతెచ్చి భర్త చేతికిస్తుండగా –

"అమ్మా ఆకలి... కాస్త బువ్వుంటే పెట్టమ్మా" బయట్నించి ముసలి బిక్షగాడి కేక.

ఆ బిక్షగాడి మీద విసుక్కుంటూ –

"వీడికీ ఇప్పుడే అర్జంటా? రోజూ నేను ఆఫీసుకు వెళ్లే హడావిడిలో ఉండగానే ఇక్కడ ప్రత్యక్షమవుతాడు. ఏం ప్రతిరోజూ వాడికి పెట్టాలనే రూలేమైనా ఉందా? ఓ రెండ్రోజులు తిండి

పెట్టడం మానెయ్. వాడే రావడం మానుకుంటాడు" అన్నాడు కోపంగా సతీష్,

"బిక్షగాళ్ల మీద అలా విసుక్కోకండి. మీ సమయం వృథా కాకుండా మీరెళ్లాకే అతడికి అన్నం వేస్తాలే. ఏదో ఇంత అన్నం ముద్ద కోసం ఆశతో ఇంతదూరం వస్తాడు. ఇంత తిండి పెట్టినంత మాత్రాన మన ఆస్తులేమీ తరగవులెండి. అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పది కదా! ఇంకా ఏదో అనబోతుండగా...

"దానశీలీ! నీకో నమస్కారం. ఇక సుత్తి వేయక. దానం గురించి ప్రసంగించమంటే నీకు గంటలు కాదు... రోజులు కావాలి. ఇక పురాణాలు, ఇతిహాసాల్లోకి వెళ్లిపోతావ్. బై..." చెప్పాడు వెళ్లిపోతూ.

"వస్తాను మమ్మీ" అంటూ సుభాష్ టాటా చెప్పాడు.

పెళ్లైన ఎన్నో ఏళ్లకు పుట్టిన సుభాష్‌ని ఎత్తుకొని ముద్దుపెట్టుకొని "ఇక వెళ్లు" అని టాటా చెప్పింది... అల్లారు ముద్దుగా పెంచుతున్న కొడుకుని చూసి మురిసిపోతూ,

సతీష్ బైక్ స్టార్ట్‌చేసి ఇంటి ముందు అలాగే నిలబడిన బిక్షగాడి వైపు అదోలా చూస్తూ వెళ్లిపోయాడు.

సుజాత లోపలికెళ్లి గిన్నెనిండా అన్నం, పప్పు తెచ్చి బిక్షగాడికి వేస్తుండగా "అమ్మాయిగారూ... నేను రోజూ వస్తుంటే అయ్యగారు నామీద చానా కోపంతో ఉంటాడు కదమ్మా" అన్నాడు.

"నీ మీద కోపం కాదయ్యా. అయ్యగారు బయల్దేరే సమయానికే నువ్వూ వస్తావు. నీకు అన్నం పెట్టడానికి కాస్త సమయం పడుతుంది కదా! ఆ సమయం తనకు కేటాయిస్తే తొందరగా ఆఫీసుకు వెళ్లొచ్చని అంతే..." అంది.



"ఇంక నుంచి అయ్యగారు ఆఫీస్‌కు పోయినంకా వస్తానండమ్మా. ఈ వీధిలో ఇప్పటికోసం దా అన్నంపెట్టేది మీరే. మీ సల్లని మనసుతో వేసిన ఒక్క ముద్ద తిన్నా చాలమ్మాయిగారు నాకడుపు నిండిపోతుంది. మీరు అన్నారు.

మీ బిడ్డ నూరేళ్లపాటు చల్లంగా ఉండాల"ని దీవించి వెళ్లిపోయాడు.

ఆ రోజు ఆదివారం. చికెన్ ఫ్రై, చపాతి చేసి భర్తకి, కొడుక్కీ వడ్డించి తనూ తినడానికి కూర్చుంది సుజాత.

అప్పుడే వచ్చిన బిక్షగాడు "అమ్మా" అని అరిచాడు.

"ఊ...! వచ్చాడు చూడు. నీ వీర బిక్షాభిమాని. వాడికి టైమూ లేదు, పాడూ లేదు. లే వెళ్లి వెయ్యి" అన్నాడు భార్య తినడానికి కూర్చున్నప్పుడు కూడా మనశ్శాంతిగా తిననియ్యడు వీడు అన్న కసితో.

భర్త అంతరంగాన్ని గ్రహించిన సుజాత ముసిముసిగా నవ్వుకుంటూనే చపాతి, ఓ రెండు చికెన్ ముక్కలు తీసుకొని వేసొచ్చి కూర్చుంది.

సుభాష్ చపాతి తిని, కాస్తనీళ్లు తాగి "అమ్మా! ఆ తాత రోజూ మనింటికి అన్నానికి వస్తుంటాడు కదా! ఆ తాతకి అమ్మా నాన్నా ఎవరూ ఉండరా?" అనడిగాడు అమాయకంగా.

"అమ్మా, నాన్నలు బతికి ఉండరేమోగాని, కొడుకులో, కూతుళ్లో ఎవరో ఒకళ్లు ఉంటారు. వాళ్లు ఈ తాతకి అన్నం పెట్టలేక బయటికి తరిమేసి ఉంటారు. ఇక అన్నం పెట్టే దిక్కు ఎవరూ ఉండక ఇలా అడుక్కుని తింటూ ఉంటాడు" అంది.

"అయ్యో పాపం! అయితే రోజూ ఆ తాతకి అన్నం పెట్టమ్మా. చూస్తే ఆ తాత చాలా మంచోడిలా ఉన్నాడు" అన్నాడు సుభాష్.

"సుభాష్! దానం గురించి మీ అమ్మకు చెప్పకురా! తను పస్తులుండైనా సరే మీ అమ్మ దానం చేస్తుంది" అని టైం చూసుకొని, సుజీ మనం మ్యాట్నీకి వెళ్దామనుకున్నాం కదా! టైం అవుతోంది. తొందరగా రెడీ అవండి అన్నాడు.

* * *

టీవి ముందు కూర్చొని ఛానల్స్ మారుస్తూ అన్నీ చెత్త ప్రోగ్రామ్స్, అడ్వర్టయిజ్‌మెంట్లే అని విసుక్కుంది సుజాత. అప్పుడే సెల్ మోగింది.

అక్కడే ఉన్న సెల్ అందుకొని బటన్ నొక్కి "హలో" అంది.

సుజీ నేను... అని భర్త ఏదో చెబుతున్నాడు. టీవీ వాల్యూమ్ ఎక్కువగా ఉండడంతో సరిగా వినబడట్లేదు. వ్యాల్యూమ్ తగ్గించి, "చెప్పండి" అంది.

"సుజీ నాకు పని కాస్త ఎక్కువగా ఉంది. బాబుని తీసుకు రావడానికి కుదరదు. నువ్వెళ్లి పిల్చుకురా!" అన్నాడు.

"అప్పుడే స్కూల్ వదిలేసి ఉంటారు. ఇలాంటి సమస్యలు వస్తాయనే బాబుని స్కూల్ బస్‌లో పంపుదామంటే ఎందుకు డబ్బులు దండగా అన్నారు. ఇప్పుడు చూడండి... నాకు ఎంత టెన్షనో... అంటూ – అలాగే లెండి" అని సెల్ స్విచ్ ఆఫ్ చేసి బాబుని తీసుకురావటానికి బయలుదేరుతూ టీవి ఆఫ్ చేయటానికి రిమోట్ తీసుకొని ఆఫ్ చేయబోతూండగా కనిపించిందా దృశ్యం.

టీవీలో తన కొడుకు సుభాష్ గాయాలతో తలకు, చేతులకూ బ్యాండేజీలతో ఆసుపత్రిలో బెడ్‌పై అచేతనంగా పడిఉండడం...

అంతే... ఆమె "సుభాష్" అని హిస్టీరియా వచ్చిన దానిలా అరుస్తూ షాక్‌కు గురై అక్కడే కుప్పకూలిపోయింది.

కొద్దిసేపటికి ఇంటికొచ్చిన సతీష్ భార్య అలా పడి ఉండటం చూసి ఏమైందోనన్న

ఆందోళనతో టైబుల్‌పైనున్న జగ్గుతో నీళ్లతెచ్చి ముఖం మీద చిలకరించి "సుజీ... సుజీ...! ఏమైంది? ఎందుకలా పడిపోయావు?" అంటు న్నాడు దగ్గుత్తికతో!

మెల్లగా కళ్లు తెరిచిన సుజాత "బాబు... బాబు..." అంటూ కలవరించింది.

"బాబుకి ఏమైంది సుజీ?" అన్నాడు భయాందోళన చెందుతూ.

ఈలోకంలోకి వచ్చిన సుజాత రోదిస్తూ-

"ఏమండీ మన బాబుకి యాక్సిడెంట్ జరిగి నట్లుందండి. ఆసుపత్రిలో గాయాలతో పడి ఉన్నాడు. నేనిప్పుడే టీవీలో చూసాను" అంది.

బాలుడి ప్రమాద వార్త తల్లిదండ్రులకు తెలియజేయాలని టీవి ఛానల్ వాళ్లు పదే పదే ఆవార్తను, ఆ దృశాన్నీ క్లోజప్‌లో చూపిస్తు న్నారు. ఈ బాలుడు ఫలానా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు అని న్యూస్ రీడర్ చదువుతూండగా సతీష్ టీవీ వాల్యూమ్ పెంచి శ్రద్ధగా విన్నాడు.

స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వస్తున్న బాలు డ్ని ఇద్దరు దుండగులు కిడ్నాప్ చేసినట్లు పట్టు బడిన దుండగులు తెలిపారు. స్పృహ కోల్పో యిన బాబుని ఓ వ్యక్తి రక్షించి, హాస్పటల్లో చేర్చాడని సమాచారం.

ఇద్దరూ హుటాహుటిన హాస్పటల్‌కు చేరు కొని, బాబుని చూసి శోకసముద్రంలో మునిగి పోయారు. బాబు ఇంకా స్పృహలోకి రాలేదు.

వెంటనే డాక్టర్ని కలిసి "సార్! బాబు తల్లి దండ్రులం మేమే. బాబుకి ఇప్పుడు ఆరోగ్యం ఎలా ఉంది సార్" అనడిగారు.

"బాబుకి ప్రమాదం ఏమీ లేదు. కొద్దిసేపట్లో మీరు తీసుకెళ్లొచ్చు. మీ బాబుని కాపాడిన వ్యక్తి బయట ఉన్నాడు రండి" అని బయటకు వచ్చి అతను కూర్చున్న చోటుని చూపిస్తుండగా ఆ వ్యక్తి కనిపించలేదు.

అరె! ఇంతవరకూ ఇక్కడే ఉన్నాడు. అంత లోనే వెళ్లిపోయాడు" అని డాక్టర్ అంటూం డగా...

సిస్టర్ వచ్చి "సార్ బాబు స్పృహలోకి వచ్చా డు" అనగానే దంపతులిద్దరూ పరుగులాంటి నడకతో వార్డులోకి ప్రవేశించారు.

కొద్దిసేపటికి పూర్తిగా కోలుకొని కళ్లు తెరి చిన బాబు అమ్మా, నాన్నలను చూసిన ఆనం దంతో "అమ్మా" అన్నాడు.

సుజాత బెడ్ మీద కూర్చొని బాబుని తన వళ్లో పడుకోబెట్టుకొని "ఎలాఉంది నాన్నా?" అంది కళ్లనీళ్లు తుడుచుకుంటూ.

"ఇప్పుడు బాగుందమ్మా" అన్నాడు.

"కొంచెంలో ఎంత ప్రమాదం తప్పింది బాబూ. నిన్ను రక్షించింది ఎవరు నాన్నా?" అనడిగింది.

"తాతయ్యమ్మా! రోజూ మనింటికి వచ్చి అన్నం పెట్టించుకు పోతుంటాడే ఆ తాతయ్య" అనగానే సుజాత, సతీష్ లిద్దరూ సంభ్రమాశ్చ ర్యాలకిలోనై ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసు కొని మనసులోనే అతనికి కృతజ్ఞతలు తెలుపు కున్నారు.

డాడీ కోసం ఎంతసేపో ఎదురు చూశాన మ్మా. ఇక రాడనుకొని ఈ సందులోంచి వెళ్తే ఇంటికి దగ్గరౌతుందని సందు మలుపు తిరుగు తూండగా ఇద్దరు అంకుల్స్ మోటార్ బైక్ మీద వచ్చి "మీ నాన్నకు యాక్సిడెంట్ అయింది. హాస్పటల్లో ఉన్నాడు. నువ్వు అర్జంటుగా రావా

లంటూ" నా చెయ్యి పట్టుకొని మోటార్‌బైక్ మీద ఎక్కించబోతుండగా నువ్వు చెప్పిన మాట నాకు గుర్తుకు వచ్చిందమ్మా. ఎవరైనా కొత్త వాళ్లొచ్చి నీకు చాక్లెట్స్ కొనిస్తామనో, మీ అమ్మకో, నాన్నకో యాక్సిడెంట్ అయిందనో ఏదో ఒక అబద్ధం చెప్పి పిల్లల్ని ఎత్తుకు పోతుంటారు. అలా ఎవరైనా పిలిస్తే వెళ్లొద్దు. గట్టిగా అరిచెయ్ అని చెప్పావు కదా! అలాగే చేశాను. కాని ఓ అంకుల్ నా నోరు గట్టిగా మూసి బైక్ మీద ఎక్కించుకోబోతూండగా అట్నుంచే వస్తున్న తాతయ్య నన్ను చూసి గుర్తుపట్టి "ఏయ్ ఆగండ్రా" అని పరిగెత్తుకుంటూ వచ్చి చేతిలో ఉన్న కర్రను విసిరాడు. కర్ర చక్రాలకు తగిలి, ముగ్గురం కింద పడిపోయాం. అంతే నాకు గుర్తమ్మా? అన్నాడు.

అంతలో బయటికి వెళ్లిన ఆ తాత అక్కడికి వచ్చాడు.

తాతను చూడగానే ఇద్దరూ వెళ్లి అతడి చేతులు పట్టుకొని కృతజ్ఞతలు తెలిపారు.

"తాతా నీ రుణం ఎలా తీర్చుకోను? ఒక్కగానొక్క నా కొడుక్కి ప్రాణం పోసావు" అంటూ ఆనందభాష్పాలు రాల్చింది సుజాత.

"తాతా నువ్వు మా ఇంటికి బిక్షానికి వచ్చినప్పుడల్లా నిన్ను చూసి విసుక్కునే వాడిని కదా! నన్ను క్షమించు తాతా. నువ్వింకెప్పుడూ మా ఇంటికి అడుక్కోవటానికి రానక్కర్లేదు. మా ఇంట్లోనే ఉండు. మాలో ఒకడిగా ఉండు" అన్నాడు మనస్ఫూర్తిగా.

వాళ్లు తనను తమతోపాటు ఉండమన్న సంతోషం కన్నా బాబు ప్రాణం కాపాడగలిగానన్న తృప్తి ఆ తాత కళ్ళల్లో మెరిసింది. ●



త్యాగరాయగానసభ, కళా సుబ్బారావు వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఉగాది పురస్కారాన్ని కవి, రచయిత శ్రీ ఎన్.వి. రఘువీరప్రతాప్‌కి ప్రదానం చేస్తున్న కళా వేంకటదీక్షితులు, శ్రీ సుధామ, హాస్యనటులు గుండు సుదర్శన్, సినీదర్శకులు డా॥ వడ్డేపల్లి కృష్ణ, సుందర్రావ్, దైవజ్ఞశర్మ.